క్లుప్తంగా

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ పి. సంధ్యారాణి అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్, అడంగల్ పత్రాలతో ఈ నెల 20వ తేదీలోగా వీఏఏ వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను జయప్రదం చేయాలి



దుగ్గిరాల: రాష్ట్ర స్థాయి ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ దుగ్గిరాల ప్రధాన కార్యదర్శి చెట్టిపోగు లక్ష్మణ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన ఈమని గ్రామంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో 1–5 తరగతులను, ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. విద్యార్థులతో సంబంధం లేకుండా కనీసం రెండు ఎస్జీటీ పోస్టులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ కమిటీ వెయ్యాలని కోరారు. 30 శాతం ఐఆర్‌ను మంజూరు చెయ్యాలన్నారు. ఇవే డిమాండ్లతో జరగనున్న రాష్ట్ర స్థాయి ధర్నాను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు.

కోర్టుల తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ ఇక్కడి కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకుని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.నవనీతం, ఇమాంబి, గురవయ్య, దానయ్య, హగ్గయ్య, దుర్గాభవాని, సూర్యప్రకాశరావు, శారద, ఎం.సుబ్బారావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో మేలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవిశిక్షణలో భాగంగా 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు చదివే విధానం, ఎటువంటి అంశాలుతో కూడినవి చదవాలి వంటి వాటిపై ఉపాధ్యాయుడు రాజు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో పలు పుస్తకాలను చదివించారు. పుస్తకాలు చదవడం వల్ల మేలు జరుగుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రాకపోకల సమస్యలపై డీపీవో పరిశీలన



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో రైతులకు, ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యానికి మధ్య ఏర్పడిన స్థల వివాదంపై మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ పరిశీలన చేశారు. నారాకోడూరులోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాల పక్కన రైతుల పొలాలకు వెళ్లేందుకు డొంక పోరంబోకు బళ్లబాట ఉంది. దీనిపై రైతులకు , కళాశాల యాజమాన్యానికి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. సర్వే చేసిన అనంతరం రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. దీని నిమిత్తం సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్ర పరిశీలన చేశారు. రెండు రోజుల్లో ఇరువర్గాల వారితో మాట్లాడి నివేదికను అందజేయాలని తెనాలి డీఎల్‌పీవో స్వరూపారాణిని డీపీవో సాయికుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో చేబ్రోలు పీఎస్ కె. శ్రీనివాసరావు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

శలపాడు... చెత్తే ఎటు చూడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నీ ప్రచార ఆర్భాటాలే కనిపిస్తున్నాయి. స్వచ్ఛత విషయంలో ఇటీవల హడావుడి చేసిన అధికార పార్టీ నాయకులు, అధికారులు ఆ తర్వాత కనీసం పట్టించుకున్న పాపానపోవడం లేదు. శలపాడులో పారిశుద్ధ్యం మచ్చుకైనా కనిపించడం లేదు. ఇటు పాలకులు, అటు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజలు అసౌకర్యానికి గురవడంతో పాటు వ్యాధుల బారిన పడుతున్నారు.

- గ్రామంలో మచ్చుకైనా కానరాని స్వచ్ఛత
- అలంకారప్రాయంగా చెత్త సంపద కేంద్రం
- ప్రచారానికే పరిమితమైన కూటమి సర్కారు
- క్షేత్రస్థాయిలో తీవ్ర నిర్లక్ష్యంగా యంత్రాంగం



చేబ్రోలు మండలం శలపాడు నుంచి సుద్దపల్లి వెళ్లే రోడ్డులో రహదారి పక్కన వ్యర్థాలు

శలపాడు(చేబ్రోలు): గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నామని, ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు కూటమి ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. చేబ్రోలు మండలం శలపాడు గ్రామ పంచాయతీ దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా గ్రామాల్లోని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా సంపద సృష్టించాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.లక్షల నిధులు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. ప్రభుత్వం చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో చేస్తున్న పనులకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రస్తుతం శలపాడు తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. సుమారు ఐదు వేల జనాభా కలిగిన శలపాడు గ్రామంలో పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. తెనాలి, గుంటూరు ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి సమీప ప్రాంతంలో ఉన్న శలపాడు గ్రామంలో పారిశుద్ధ్యం నానాటికీ దిగజారుతోంది. చెత్త తొలగింపులో పంచాయతీ సిబ్బందికి చిత్తశుద్ధి కొరవడింది.

రోడ్డు మార్జినే డంపింగ్ యార్డు

శలపాడు నుంచి సుద్దపల్లి వెళ్లే ప్రధాన రహదారి ప్రాంతం, శలపాడు నుంచి వీరనాయకునిపాలెం వెళ్లే ప్రధాన రహదారి మార్జిన్లే డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. గ్రామంలోని చెత్తా చెదారం పంచాయతీ సిబ్బంది సేకరించి రోడ్డు మార్జిన్‌లలో వేస్తుండటంతో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. కోళ్ల వ్యర్థాలు, జంతు కళేబరాలు కూడా పడేస్తున్నారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగాలబారిన పడుతున్నట్లు వాపోతున్నారు.

ఉన్నా ఉపయోగం శూన్యం

రూ.లక్షల వ్యయంతో చెత్త సంపద కేంద్రం నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా దానిని వాడుకలోకి తీసుకురాలేదు. దీంతో అలంకార ప్రాయంగా మారింది. పంచాయతీ సిబ్బంది రిక్షాల ద్వారా సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయటంతో అపరిశుభ్ర వాతవరణం నెలకొంది. చెత్త నుంచి సంపద సృష్టించటానికి నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీ షెడ్డు నిరుపయోగంగా మారింది. ఫిట్లు శిథిలావస్థకు చేరి నెర్రెలు ఇచ్చి పెచ్చులు ఊడిపోతున్నాయి.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంపై 'సాక్షి' ఎంపీడీవో ఎ.ఉమాదేవిని వివరణ కోరగా.. పంచాయతీ సిబ్బందికి తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మార్జిన్లలో వ్యర్థాలు వేయకుండా చెత్త సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సచివాలయం పక్కన ఉన్న చెరువు అపరిశుభ్రంగా ఉండటంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

– ఎ.ఉమాదేవి, ఎంపీడీవో, చేబ్రోలు



వీరనాయకునిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు మార్జిన్ పక్కన పేరుకుపోయిన చెత్త



అలంకార ప్రాయంగా శలపాడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



చెత్త సంపద కేంద్రం వద్ద ఉపయోగించకుండానే శిథిలావస్థకు చేరిన ఫిట్లు

వైఎస్సార్ సీపీ

బలోపేతమే లక్ష్యం కావాలి



పార్టీ మండల అధ్యక్షునిగా ముడియాల మల్లికార్జునరెడ్డి పేరును ప్రకటిస్తున్న అంబటి మురళీకృష్ణ

- పెదకాకానిలో మండల పార్టీ సమావేశంలో నిర్ణయం
- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయడం అందరి బాధ్యతన్న అంబటి మురళీకృష్ణ
- మండల పార్టీ అధ్యక్షునిగా ముడియాల మల్లికార్జునరెడ్డిని ప్రతిపాదించిన పార్టీ శ్రేణులు



హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

పెదకాకాని: వైఎస్సార్ సీపీని పటిష్టం చేసుకుని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి సీఎం చేయడం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని పొన్నూరు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని గ్రామంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల వైఎస్సార్ సీపీ సమావేశం జరిగింది. ఆలపాటి రాఘవ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. ఏడాది కూడా గడవకముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. గెలుపోటములు ఎవరికీ శాశ్వతం కాదని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దమనకాండ పెరిగిందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బాధ్యతలు భుజాన వేసుకొని కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో తగిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు ఏకాభిప్రాయంతో మండల పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేసుకోవాలన్నారు. ఆ బాధ్యత మీదేనని సమావేశానికి హాజరైన వారితో చెప్పారు. దీంతో వారి నుంచి మంచి స్పందన వచ్చింది. నలుగురి పేర్లు ప్రతిపాదనకు వచ్చినప్పటికీ ముడియాల మల్లికార్జునరెడ్డి పేరును ప్రతిపాదించారు. దీంతో ముడియాల పేరును పార్టీ అధిష్టానానికి పంపిస్తున్నట్లు మురళీకృష్ణ ప్రకటించారు. త్వరలో పార్టీలోని అన్ని విభాగాలకు కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచులు గోళ్ళ స్వరూపారాణి, పిట్టు శివకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, షేక్ అబ్దుల్ లతీఫ్, జిల్లా జనరల్ సెక్రటరీ వుయ్యూరు సతీష్‌రెడ్డి, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాలరావు, గోళ్ళ జోసఫ్, గోళ్ళ శ్యాంము ఖర్జీబాబు, చాగంటి మురళీమోహనరెడ్డి, కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మందాళ శివారెడ్డి, కూచిపూడి మధు, దంతాల శ్రీనివాసరావు, అమ్మిశెట్టి మల్లికార్జునరావు, బద్దెపూడి రమేష్, సఫారీబాబు, భీమవరపు విజయలక్ష్మి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరిపైనా ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేయటం ద్వారా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని ప్రాడిజి విద్యాలయం డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చాటారని చెప్పారు. మండలంలోని బుడంపాడు గ్రామంలోగల పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షలకు 28 మంది హాజరుకాగా అందరూ ప్రథమ శ్రేణి సాధించారన్నారు. 96 శాతం మార్కులతో ఎ. రామ్‌చరణ్ ప్రథమ స్థానంలో నిలవగా, 95 శాతం మార్కులతో వై.భవిష్య ద్వితీయ స్థానం, 94 శాతం మార్కులతో షేక్ హాఫీజ్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ వై రథినిచౌదరి మాట్లాడుతూ నైపుణ్యాలతో కూడిన విద్యావిధానాలతో బోధన చేయటం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.సూర్యకుమారి మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



కొత్తరెడ్డిపాలెంలోని దేవస్థానంలో ప్రసన్నాంజనేయ స్వామి వారు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదె వీరారెడ్డి మంగళవారం తెలిపారు. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్ క్రీడా ప్రాంగణనందు మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 14వ తేదీన స్వామి వారికి 108 కలశములతో జలాభిషేకం, 15న సింధూరాభిషేకం, 16న పుష్పాభిషేకం, 17న హిరణ్యాభిషేకము, 18న అన్నాభిషేకం, 19న సుగంధ ద్రవ్యములతో అభిషేకములు, 20న పంచామృతాభిషేకములు, 21న లక్ష నాగవల్లీ దళాలతో పూజ, 22న స్వామి వారికి విశేషాభిషేకములు, వివిధ హోమాలు జరుగుతాయి. 22న అన్న సంతర్పణ, స్వామి వారి ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 14 నుంచి 21వ తేదీ వరకు చేబ్రోలు, మంచాల, కొత్తరెడ్డిపాలెం, గుండవరం, శలపాడు, కోవెలమూడి, గ్రామాలకు చెందిన భక్త సమాజములచే భజన కార్యక్రమాలు జరుగుతాయని గాదె వీరారెడ్డి తెలిపారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ



పొన్నూరు: మండల పరిధి దొప్పలపూడి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ వి. రామకోటేశ్వరి మాట్లాడుతూ పంట భూమిలోని సారాన్ని పెంచే క్రమంలో మండలంలోని పలు గ్రామాలకు 50 శాతం రాయితీతో 58 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 40 క్వింటాళ్ల జనుము విత్తనాలను రైతులకు అందించనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో తీసుకోవాలని అన్నదాతలకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ డేగల వెంకట్రామయ్య, సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాల్సి ఉండగా వారిని విస్మరిస్తూ, కూటమి నేతలకే ప్రాధాన్యమిస్తున్న వ్యవసాయ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్



ఆర్టీసీ డిపోలో మద్యం తాగిన వారిని పరీక్షిస్తున్న పోలీస్ సిబ్బంది

పొన్నూరు: పట్టణ పరిధిలో బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వీరా నాయక్ హెచ్చరించారు. పట్టణంలోని మద్యం దుకాణాల పరిసరాల్లో తాగే వారిపై చర్యలు శూన్యమని చెబుతూ 'మద్యం మత్తులో పొన్నూరు' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి పట్టణ పోలీసులు స్పందించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రైల్వే స్టేషన్ రోడ్డు, ఐలాండ్ సెంటర్‌లోని కారు స్టాండ్ తదితర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై మద్యం తాగేవారు, తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని అన్నారు. నిబంధనలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలని తెలిపారు.

తమ్ముళ్ల తవ్వకం.. మట్టి మాయం!

అధికారం ఉంది.. ఇక అడిగేదెవరు.. అన్నట్లుంది కూటమి నేతల తీరు. అక్రమాలకు, అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఆదాయమే పరమావధిగా ఇష్టం వచ్చినట్లు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. లారీలకొద్దీ మట్టిని తరలించి జేబులు నింపుకొంటున్నారు. ఎవరైనా అడ్డుకుంటే అంతే సంగతులు అన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

- విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు
- కనీసం పట్టించుకోని అధికారులు
- ప్రజాధనం లూటీ చేస్తున్న కూటమి నేతలు
- వాహనాల రద్దీతో ప్రజలకు తప్పని అవస్థలు



లారీలలో తరలిస్తున్న మట్టి

గుంటూరు రూరల్: కాకుమాను మండలంలోని కాకుమాను, బీకే పాలెం గ్రామాల మధ్య అక్రమ మైనింగ్‌ను విచ్చలవిడిగా సాగిస్తున్నారని స్థానిక గ్రామాల ప్రజలు వాపోతున్నారు. భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేస్తూ ప్రతి రోజు వందల సంఖ్యలో లారీలలో తరలిస్తున్నారని అంటున్నారు. కనీసం రైతులు తమ పొలాల్లో మట్టిని తవ్వుకోవాలంటే అధికారులు సవాలక్ష నిబంధనలు విధిస్తుంటారు. అనుమతులు, పత్రాలు అంటూ విసిగిస్తారు. కానీ నేడు అధికార పార్టీ నేతలు ఎక్కడపడితే అక్కడ తవ్వుకుని బహిరంగంగానే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా ఒక్కరూ స్పందించకపోవడంపై గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమంగా మట్టిని తరలించి ఒక్కో లారీ లోడు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు. నిత్యం రూ. లక్షల్లో సొమ్ము చేసుకునే అక్రమార్కుల వైపు మైనింగ్ అధికారులుగానీ, విజిలెన్స్ యంత్రాంగంగానీ, రెవెన్యూ అధికారులుగానీ ఎందుకు పట్టించుకోవటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నంబరు ప్లేట్లు లేకుండానే...

మట్టితో ప్రయాణించే లారీలు, టిప్పర్లు అతివేగంగా గ్రామాల మధ్య నుంచి భారీ స్థాయిలో రాకపోకలు సాగిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారుల్లోకి రావాలంటే సాధ్యపడని రీతిలో వాహనాల రద్దీ పెరిగిందని వాపోతున్నారు. లారీల భయంతో కనీసం బయటకు కూడా రాలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తరలించే టిప్పర్లకు కనీసం నంబర్ ప్లేట్లు కూడా ఉండటం లేదని, చూడాలంటే కనిపించనంత వేగంగా వెళుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొట్టే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఊళ్లలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని పేర్కొంటున్నారు. అటు ప్రభుత్వ ధనాన్ని, ఇటు తమను కాపాడాలని కోరుతున్నారు.

మానసిక సమస్యలకు టోల్‌ఫ్రీ నంబరు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రావణి

మంగళగిరి టౌన్: మంగళగిరి ఎయిమ్స్ సైక్రియాట్రీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో టెలి–మానస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టెలి–మానస్ పేరిట 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నా నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ట్రైన్డ్ కౌన్సిలర్లు తగిన సహాయం చేస్తారని తెలిపారు. సమస్య పెద్దగా ఉన్న పక్షంలో దగ్గరలోని సైక్రియాట్రిస్ట్‌కు రిఫర్ చేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వీస్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని ప్రజలకు టెలి–మానస్‌పై అవగాహన కల్పించాలని కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌లోని సైక్రియాట్రీ విభాగంలో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనూష మాట్లాడుతూ కొన్ని సమస్యలు కౌన్సెలింగ్ ద్వారా తీరతాయని తెలిపారు. మందుల ద్వారా కూడా వైద్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. మందులతో నయం కాని వారికి వేరే పరికరాలతో ట్రీట్‌మెంట్ ఇస్తామని పేర్కొన్నారు. యోగ, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా కొంతవరకు మానసిక సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జి.అనూష, కో ఆర్డినేటర్ అంజయ్య, డీఈవో అశోక్, డాక్టర్ జగదీష్, వైద్యులు చిన్మయి, ఆదిత్య, ప్రీతమ్, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళి

లక్ష్మీపురం: ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిసినట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. వీర జవాన్లకు అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. తొలుత వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో గట్టి గుణపాఠం చెప్పామన్న ప్రధాని మాటలు అక్షర సత్యమన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

దొంతిరెడ్డి శ్రీలత W/o రామ్మోహన్ రెడ్డి R/o డోర్ నెం. 1-77/B, వెనిగండ్ల గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా-522509, అను నా పేరిట గుంటూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో డాక్యుమెంట్ నెం. **8556/1985** రుగా రిజిష్టరు అయిన వెనిగండ్ల గ్రామంలోని డి.నెం. 118రు లోని యం.0.33 సెంట్ల పొలం తాలూకు ఓరిజినల్ డాక్యుమెంటు ది. 01-02-2025వ పెదకాకానిలో ఫోటో స్టాట్ తీయించుకొని ఇంటికి వెళ్ళే మార్గ మధ్యంలో పోయినవి. దొరికిన వారు పై చిరునామాలో అందజేయగలరు. సెల్: 9398041578

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



పెదకాకాని: శివాలయంలో నిత్య అన్నదాన పథకానికి భార్య జయమ్మ జ్ఞాపకార్థం భర్త బైరపనేని నరసింహారావు రూ.లక్ష విరాళం అందజేశారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన నరసింహారావు, వారి కుమారులు సీతారామయ్య, మల్లికార్జునరావులు మంగళవారం ఈ విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి విగ్రహం తొలగింపు

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలోని వీరాంజనేయస్వామి విగ్రహానికి మంగళవారం వేదపండితులు కళాపకర్షణ కార్యక్రమం నిర్వహించినట్లు దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో విగ్రహానికి విశేషపూజలు, కళాపకర్షణ కార్యక్రమాలను నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 31న నిర్వహించనున్నారు.